క్లుప్తంగా

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఎ.మురళీకృష్ణ అనే దాత రూ.1,00,116 విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నదాన విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు. అధికారులు దాతకు స్వామివారి దర్శనాన్ని కల్పించి ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన విభాగం సిబ్బంది హరి పాల్గొన్నారు.

2 నుంచి సీతారాముల వార్షిక కల్యాణోత్సవాలు



సీతారాముల కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై ఉన్న ప్రాచీన రామాలయంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 2వ తేదీన అంకురార్పణ, 3న సాయంత్రం 5గంటలకు స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం జరుగుతాయని తెలియజేశారు. భక్తులు, గ్రామస్తులు తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కార్తికేయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను జరిపించారు.

వేతనాల అమలు కోసం ఎన్‌జేసీఎస్ కన్వీనర్‌కు లేఖ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ జాతీయ కార్యదర్శి లలిత్ మిశ్రా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎన్‌జేసీఎస్ కన్వీనర్‌కు లేఖ రాశారు. దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులకు 2021 అక్టోబర్ 21న వేతన ఒప్పందం జరిగిందన్నారు. ఆ ఒప్పందాన్ని సెయిల్ యాజమాన్యం వెంటనే అమలు చేసింది కానీ, విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇంతవరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. కన్వీనర్‌గా ఈ విషయంపై దృష్టి సారించి, స్టీల్ కార్మికులకు తక్షణం నూతన వేతనాలు అమలు చేసేలా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి సూచించాలని కోరారు. ఈ లేఖను స్టీల్ సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి. దాస్, యు.రామస్వామి స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు మంగళవారం అందజేశారు.

18న కంప్యూటర్ సైన్స్ ఫ్రెషర్స్‌డే

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాల ఫ్రెషర్స్‌డే వేడుకలను వచ్చే నెల 18న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విభాగాధిపతులు ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య కుంజం నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ భాష అమృతతుల్యం



సబ్బవరం హైస్కూల్లో మాట్లాడుతున్న ఎంఈవో అప్పలరాజు



పెందుర్తి గ్రంథాలయంలో మాతృభాష విశిష్టతను పాఠకులకు వివరిస్తున్న వక్తలు

సింహాచలం: అమ్మభాష అమృత తుల్యమని వక్తలు పేర్కొన్నారు. మాతృభాష పరిరక్షణకు, ప్రాభవానికి కృషి చేయాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం పెందుర్తి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, లఘు నాటిక పోటీలు నిర్వహించి, మాతృ భాష గొప్పదనాన్ని ప్రధానోపాధ్యాయుడు మూర్తి వివరించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెందుర్తి శాఖ గ్రంథాలయంలో జరిగిన మాతృభాషా దినోత్సవంలో ఉపాధ్యాయిని కనకమహాలక్ష్మి మాట్లాడుతూ అమ్మ భాషని మించిన మాతృభాష మరొకటి ఉండదన్నారు. ఎన్నో యాసలు,



పాత పెందుర్తి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం మూర్తి

సామెతలు, జాతీయాలతో పరిపుష్టమైనదని తెలుగు భాషని అని తెలియజేశారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు కొనియాడారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సెక్రటరీ ఆడారి రామకృష్ణ మాట్లాడతూ ప్రాథమిక స్థాయి విద్యా బోధన మాతృభాషలోనే ఉండాలని, తద్వారా జ్ఞానాన్ని పరిపుష్టంగా నేర్చుకోగలుగుతారని తెలిపారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ తెలుగు భాష విశిష్టతను తెలియజేశారు.

సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం సిహెచ్.చిన్నమ్మాయి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో ఎస్.అప్పలరాజు మాట్లాడుతూ అమ్మ ఒడి నుంచి మనం ముందుగా నేర్చుకునే భాషే మాతృభాషని తెలిపారు. మనసులోని భావాలను సహజంగా వ్యక్తం చేయగల శక్తి మాతృభాషకే ఉంటుందన్నారు. ప్రస్తుతం మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ పరభాషల వెంట పరుగులు తీస్తున్నారని చెప్పారు. ఇతర భాషలు నేర్చుకోవడం అవసరమే కానీ.. ఆ నెపంతో మాతృభాషను చిన్నచూపు చూడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా ఉపాధ్యాయులు డి.రాంప్రసాద్, సిహెచ్.కుమార్ ప్రకాష్, నాగమణి, పీడీ రెహమాన్, పాల్గొన్నారు.

28న తవ్వవానిపాలెంలో పరదేశిమాంబ పండగ



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ స్వామినాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం ప్రజల ఆరాధ్యదైవం పరదేశిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని ఈ నెల 28న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవ కరపత్రాలను సర్పంచ్ బోకం స్వామినాయుడు, గ్రామ పెద్దలు మంగళవారం ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోకం శ్రీనివాసరావు సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పోటీలు

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పలు పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్, జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు, జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్‌తో పాటు మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాటం పోటీలు, గుర్రపు పందాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 28న అనుపు మహోత్సవం సందర్భంగా సినీ సెలబ్రిటీలతో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, మండల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బోకం శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ వనం దేముడుబాబు, సచివాలయ కన్వీనర్ బోకం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం



740వ రోజు దీక్షలో పాల్గొన్న సింటర్ ప్లాంట్ కార్మికులు

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా, కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 740వ రోజు సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. విభజన హామీలను విస్మరించి, రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఐక్య ఉద్యమాలతో ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. స్వామి నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణ మహోత్సవాన్ని మంగళవారం నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కుట్టు మిషన్ల పంపిణీ

మద్దిలపాలెం: మహిళల స్వయం ఉపాధికి బాటలు వేయాలన్న సంకల్పంతో వృత్తి విద్యా శిక్షణలో భాగంగా 261 మందికి ఉచితంగా మోటార్‌తో కూడిన కుట్టుమిషన్లను మంగళవారం జనశిక్షణా సంస్థాన్‌లో అందజేశామని డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కరరామ్, రోటరీ పూర్వ గవర్నర్ ఎం.జగదీశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనశిక్షణా సంస్థాన్‌లో రెండు బ్యాచ్‌లు, ఎండాడ, మధురవాడ సెంటర్లలో ఒక్కో బ్యాచ్‌కు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన వారికి మంగళవారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేపట్టామన్నారు. స్వయం ఉపాధికి అవసరమైన స్వల్ప రుణాలు మంజూరు కోసం బ్యాంకులతో సంప్రదిస్తున్నామన్నారు. నెలకు రూ.10వేలు వరకూ ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణా సంస్థాన్ చైర్మన్ రామరాజు, డైరెక్టర్ సిహెచ్.అప్పలనాయుడు, ఎల్.మనోహర్, చంద్రశేఖర్, శాంతాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డైట్ లెక్చరర్ మాధవి, చిత్రంలో డీఈవో చంద్రకళ

సింహాచలం: ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ విద్యార్థులకు సూచించారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు భీమిలి డైట్ టీమ్ మంగళవారం పరీక్ష పర్వ్ 4.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో చంద్రకళ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే చాలా సులభంగా సమాధానాలు రాయవచ్చని సూచించారు. ప్రతీ విద్యార్థి బాగా చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు. డైట్ లెక్చరర్ మాధవి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలంటే పండగలా భావించాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఏ రోజుకారోజే చదివి, అర్థం చేసుకుంటే, పరీక్షలంటే భయమే ఉండదన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు పాల్గొన్నారు.

సరస్వతిదేవి సేవలు చిరస్మరణీయం

ఎంవీపీ కాలనీ: లెబెన్ హిల్ఫే మానసిక వికలాంగుల పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ టి.సరస్వతిదేవి సేవలు చిరస్మరణీయమని గీతం అధ్యక్షుడు శ్రీభరత్ అన్నారు. సరస్వతీ దేవి 80వ జయంతి వేడుకలను మంగళవారం ఎంవీపీ కాలనీలోని లెబెన్‌హిల్ఫే మానసిక వికలాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.పాఠశాల ఆవరణలోని సరస్వతిదేవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీభరత్ మాట్లాడుతూ సమాజ సేవకే జీవితాన్ని అంకితం చేసిన సరస్వతి దేవి వికలాంగ విద్యార్థుల ఆనందం కోసం నిత్యం పరితపించారన్నారు. హనీ గ్రూప్ అధినేత ఓబుల్ రెడ్డి విద్యార్థుల క్రీడా పోటీల కోసం రూ.25 వేలు సాయం అందజేశారు. క్రీడల్లో విజేతలుగా నిలిచిన వికలాంగ విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి అతిథులు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, బ్రహ్మకుమారీస్ విశాఖ ప్రతినిధి రమక్క, ప్రిన్సిపాల్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఏయూ క్యాంపస్: బాల్య వివాహాలను నిరోధించాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కల్పిస్తూ తీర్చిదిద్దిన పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బాలికలకు వివాహం చేయడం, వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, చైల్డ్‌లైన్ నోడల్ అధికారి జి.సూరిబాబు, జిల్లా కోఆర్డినేటర్ జి.డేవిడ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించాలి

ఏయూ క్యాంపస్: అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించి రాణించే నైపుణ్యాలను యువతరం పెంపొందించుకోవాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఏయూ డీసీఎంఎస్ విభాగంలో నిర్వహించిన ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం, జాతీయ మేనేజ్‌మెంట్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం సమాజం మారుతుంటుందని, దీనిని తెలుసుకుని తదనుగుణంగా నైపుణ్యాలతో సుసంపన్నం కావాలన్నారు. అజినోమోటో బయో ఫార్మా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్–హెచ్‌ఆర్ డాక్టర్ పి.శ్రీనివాస్ ఠాగూర్ మాట్లాడుతూ సంక్లిష్ట సమయాలలో అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. మార్పును స్వాగతిస్తూ ముందుకు సాగేవారు నాయకులుగా ఎదుగుతారని చెప్పారు. నిరంతరం అభ్యసనం దీనికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. మైలాన్ లేబొరేటరీస్ హెచ్‌ఆర్ విభాగాధిపతి జి.సరస్వతీరావు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, విశాఖపట్నం మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య ఎన్.సాంబశివరావు తదితరులు ప్రసంగించారు.



శ్రీనివాస ఠాగూర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

జాతీయ అథ్లెటిక్స్ విజేతకు సన్మానం



పతకాలు సాధించిన క్రీడాకారుడు గోపిని సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి ఐదు మెడల్స్ సాధించిన క్రీడాకారుడు దుల్ల గోపీని విభాగంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల ఖరగ్‌పూర్‌లో జరిగిన 42వ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్ త్రో, షాట్‌పుట్, పోల్ వాల్ట్, జావెలిన్ త్రో, 4 X 100 రిలే రన్నింగ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ ఫీల్డ్ మిషనరీ విభాగం ఫీల్డ్ అసిస్టెంట్ దుల్ల గోపీ ఐదు మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం విభాగంలో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి సురేంద్ర ముఖ్య అతిథిగా హాజరై గోపీని అభినందించారు. కార్యక్రమంలో జీఎంలు ఎం.ఎస్.ఎన్. మూర్తి, డీజీఎం జి. బాబూరావు, వివిధ సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, వరసాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అదీప్‌రాజ్ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



తవ్వవానిపాలెంలో కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బోకం స్వామినాయుడు

సింహాచలం: పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. 95వ వార్డు వేపగుంట సమీపంలోని బొడ్డపాటి ఎస్టేట్స్‌లో జరిగిన ఈ వేడుకల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని అదీప్‌రాజ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. వేడుకల్లో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి ఎంపీపీ ముదపాడ నాగమణి, పార్టీ పెందుర్తి మండల అధ్యక్షుడు నక్కా కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తవ్వవానిపాలెంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాసరావు సమకూర్చిన కుట్టు మిషన్లను 10 మంది మహిళలకు సర్పంచ్ బోకం స్వామినాయుడు, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు అందజేశారు. ఈ మిషన్లు అందుకున్న వారిలో తీడ ఉషారాణి, ఉప్పాడ లక్ష్మి, బొర్రా లక్ష్మి, కోడిదాసు చిన్నమ్మలు, బొర్రా భవాని, వి.సంధ్య, బొర్రా ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వనం దేముడుబాబు, సచివాలయ కన్వీనర్ బోకం నాగేశ్వరరావు, వార్డు మెంబర్స్ వెంకటరావు, బంగారయ్య పాల్గొన్నారు.

● వెదుళ్ల నరవలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ జన్మదినం సందర్భంగా పార్టీ 88వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బొట్టా ముత్యాలరావు ఆధ్వర్యంలో పలు చోట్ల పాఠశాలల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేయించారు. ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు పెన్సిళ్లు, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాడిసి సత్యనారాయణ, చట్టి తాతారావు, బొట్టా అప్పారావు, బి.బి.రాజు పాల్గొన్నారు.

పరవాడలో..

పరవాడ: ఎమ్మెల్యే అదీప్‌రాజ్ జన్మదిన వేడుకలను పరవాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా జరిపారు. పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ తీర్థ మహోత్సవం



దుర్గమాంబ అమ్మవారు



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

సబ్బవరం: సబ్బవరం మండల ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులు వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. అమ్మవారి దర్శనానికి సబ్బవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయ విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రికి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాం ఆకట్టుకుంది.

ఘనంగా పరదేశిమాంబ పండగ

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన పరదేశిమాంబ అమ్మవారి పండగను ప్రజలు మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. మొక్కులు చెల్లించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పరిసర గ్రామాల భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రి తప్పెటగుళ్ల, నేల డ్యాన్సులు, చిడతలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని వీధుల్లో ఊరేగించారు. బాణసంచా కాల్పుల మధ్య అనుపు మహోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తదితరులున్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

క్రాష్ హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

ఉక్కునగరం: క్రాష్ హెల్మెట్ ధరించడం ద్వారా సురక్షితంగా ప్రయాణం చేయగలరని స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) విభాగం అధికారులు అన్నారు. విభాగం భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఉక్కు భద్రతా విభాగం సహకారంతో మెయిన్ గేటు వద్ద మంగళవారం క్రాష్ హెల్మెట్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రయాణాల్లో అత్యధికంగా హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నిర్ణీత వేగం, రహదారి నిబంధనలు పాటిస్తూ ఉంటే ప్రమాదాలను అధిగమించవచ్చన్నారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో విభాగం డీజీఎంలు వి. వెంకటేష్, ఎస్. రమణమూర్తి, ఎస్. శ్రీధర్, భద్రతా విభాగం సీనియర్ మేనేజర్ పి. కృష్ణమూర్తి, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎస్.వి. చిన్నం నాయుడు, బి.వి.ఎస్. ప్రకాశ్, కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ వినియోగంపై ప్రచారం చేస్తున్న ఉద్యోగులు

నెహ్రూ అవార్డు గ్రహీతకు సత్కారం

ఉక్కునగరం: జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు అందుకున్న ఇంజినీరింగ్ షాప్స్ ఎలక్ట్రికల్ ఏజీఎం ఎం. రాజశేఖర్‌ను సహోద్యోగులు సత్కరించారు. విభాగంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అధికారులు, కార్మికులు ఆయనకు శాలువా కప్పి అభినందించారు. రాజశేఖర్ చేసిన సేవలకు గుర్తింపుగా యాజమాన్యం ఆయనకు ఈ అవార్డు అందజేసిందన్నారు. కార్యక్రమంలో విభాగం అధికారులు టి. అప్పలరాజు, పోలాజి, గుప్త, వర్మ, శశిభూషణ్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న సహోద్యోగులు